క్లుప్తంగా

గోవధ నిషేధం

మార్కాపురం: బక్రీద్ పండుగ సందర్భంగా జంతు సంరక్షణ చట్టం ప్రకారం గోవధ నిషేధిస్తున్నట్లు తహశీల్దార్ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఆవులు, దూడలు, ఒంటెలు వధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో గోవధపై నిషేధం ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తారని చెప్పారు.

హెచ్ఎంగా మాలపాటి సుబ్బారెడ్డి

అర్ధవీడు: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా పాపినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా మాలపాటి సుబ్బారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి హెచ్ఎం బీ.వెంకటేశ్వర్లు ఫిబ్రవరిలో పదవీ విరమణ పొందారు. అనంతరం ఇన్‌చార్జ్‌గా లూథరు బాధ్యతలు నిర్వహించారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగనాయకులు

బేస్తవారిపేట: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. మండలంలోని ఎంపీ చెరువు, నేకునాంబాద్ సచివాలయాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. సచివాలయాల్లో రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. తడి చెత్త, పొడిచెత్తలను వేరువేరుగా సేకరించి కంపోస్ట్‌గా మార్చి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. యోగాంధ్రపై పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు, యోగా తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యాగంటి ఈశ్వర్, షహబాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు వరుణ్‌తేజ నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు కంభంలో ఉచిత వైద్య శిబిరం

కంభం: శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి బృందావనంలో శనివారం ఉచిత కంటి, గుండె ఆపరేషన్ల శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఉదయగిరి మల్లికార్జున తెలిపారు. కర్నూలు శాంతిరాం వైద్యశాల డాక్టర్లు నేత్ర, గుండె సంబంధిత పరీక్షలు చేస్తారని, ఆపరేషన్ అవసరమైన వారిని ఆస్పత్రికి తరలిస్తారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన రాచర్ల మండలంలోని రంగారెడ్డిపల్లె గ్రామ సమీపంలో హైవేపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. రంగారెడ్డిపల్లెకు చెందిన బి.కార్తీక్‌రెడ్డి బైక్‌పై గిద్దలూరు వెళ్తున్నాడు. అదే సమయంలో కనిగిరి నుంచి ఎస్.నారాయణ, సాయి అనే ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వెళ్తూ రంగారెడ్డిపల్లె సమీపంలో వెనుక నుంచి కార్తీక్‌రెడ్డిని ఢీకొట్టారు. దీంతో ముగ్గురు యువకులు రోడ్డుపై పడిపోయి గాయపడ్డారు. రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

నీటి బొట్టు నిలిచేదెలా?

- చెరువుల నిండా చిల్లచెట్లు, ముళ్లపొదలు
- పేరుకుపోయిన పూడిక.. జాడలేని అభివృద్ధి పనులు
- భూగర్భ జలాలు తగ్గుతున్నాయని రైతుల ఆవేదన
- అభివృద్ధి చేయాలని కోరుతున్న రైతులు



పిటికాయగుళ్ల చెరువులో ఏపుగా పెరిగిన చిల్లచెట్లు

బేస్తవారిపేట:

రుతుపవనాలు వచ్చాయి.. అడపాదడపా జల్లులు కురుస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే ఆ నీటిని నిల్వ చేయడం ఇప్పుడు సవాల్‌గా మారింది. చెరువుల్లో నీటిని నిల్వ చేస్తేనే ఏడాది పొడవునా పంటలకు సక్రమంగా తడులు అందించేందుకు అవకాశం ఉంటుంది. కానీ, గిద్దలూరు నియోజకవర్గంలో చెరువులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. నీటితో కళకళలాడాల్సిన చెరువులు కళావిహీనంగా నిరుపయోగంగా మారాయి. పూడిక తీయకపోవడం, చెరువు గర్భంలో భారీగా చిల్లచెట్లు, ముళ్లపొదలు పెరగడంతో నీరు నిలిచే అవకాశం లేకుండాపోయింది. చెరువుల్లో పూడిక తీయకపోవడం, పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో వర్షాలు కురిసినా ఆ నీరంతా వృథా అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూడిక పేరుకుపోవడం వల్ల ఆయకట్టు విస్తీర్ణం ఏటా తగ్గిపోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 180 చెరువులు ఉన్నాయి. 100 ఎకరాలపైగా ఆయకట్టు సాగు విస్తీర్ణం ఉన్న చెరువులు గిద్దలూరు మండలంలో 13, కొమరోలులో 9, రాచర్లలో 8, బేస్తవారిపేటలో 8, కంభంలో 3, అర్ధవీడు మండలంలో 6 ఉన్నాయి. మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కంభం చెరువులో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతోంది.

పేరుకే సాగు యాజమాన్య కమిటీలు

చెరువుల అభివృద్ధి కోసం సాగు యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారు. కానీ అవి తూతూ మంత్రంగా పనిచేస్తున్నాయి. నెలకు ఒకసారి సాధారణ సమావేశం, ఆరు నెలలకు ఓ పర్యాయం సర్వసభ్య సమావేశం నిర్వహించి చెరువుల అభివృద్ధిపై చర్చించాలి. కానీ ఇంత వరకు ఎక్కడా సమావేశాలు ఏర్పాటు చేయలేదు.

చెరువుల్లో అభివృద్ధి పనులేవి?

చెరువులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నీరు–చెట్టు పథకం ప్రవేశపెట్టింది. నియోజకవర్గంలో పలు చెరువులు చిట్టడవులను తలపిస్తున్నాయి. చిల్లకంప ఏపుగా పెరిగిపోయింది. పూడికతీతకు నోచుకోకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. చెరువుల సప్లయ్ చానళ్లు, కట్టలు, కాలువలు తదితర పనులు నిర్వహించాలని రైతులు కోరుతున్నా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. కొన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు, పాలకులు, చెరువు నీటి యాజమాన్య సంఘాలు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. చెరువులకు నీరు సరఫరా అయ్యే సప్లయ్ చానల్స్, కాలువలు అభివృద్ధి చేస్తూ కట్టలు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కట్టలు తెగిన చెరువులకు వేగంగా మరమ్మతు పనులు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



జెన్నివారిపల్లె చెరువు దుస్థితి ఇదీ..

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కమిటీలను శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

బేస్తవారిపేట మండలం..

వైస్ ప్రెసిడెంట్లుగా దప్పిలి రామచంద్రారెడ్డి, చెన్నయ్య, జనరల్ సెక్రటరీ బండ్లమూడి తిరుపతయ్య, మాదా రమణ, శ్రీని శ్రీరాములు, సంద్యపోగు పాలు, సెక్రటరీలుగా దూదేకుల సిద్దయ్య, కారేపోతుల రంగయ్య, బండ్లమూడి బాలరంగయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, జడబోయిన కోటయ్య, పల్లెబోయిన గోపాల్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీలుగా గలిజేరుగుళ్ల తిరుమలయ్య, ఆరవ పోలయ్య, చలవ వెంకటరెడ్డి, కువ్వార్ల వెంకటేశ్వరరెడ్డి, కఠారి వెంకటేశ్వర్లు, చింతం పెద్ద గురవయ్య, కాకర్ల చిన్నరాజన్న, దూదేకుల మస్తాన్ వలి, బొల్లా శివారెడ్డి, కమాటి కృష్ణారెడ్డి, భూపని గురుప్రసాద్, చిన్ని ఆంజనేయులు, దూదేకుల హుస్సేన్, నాగూర్ మీరా, తమ్మినేని సందీప్‌రెడ్డి, కొండా లక్ష్మీకాంతరెడ్డి, కొణతం రామకోటిరెడ్డిని నియమించారు.

కంభం మండలం..

వైస్ ప్రెసిడెంట్లుగా షేక్ బాజీద్ బాషా, రాదరపు శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీలుగా షేక్ సద్దామ్ హుస్సేన్, జింకా మధుసూదన్, తేట్ల జాన్ సైమన్, షేక్ బాషా, సెక్రటరీలుగా అల్లపురెడ్డి రఘునాథరెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, ఓరుగంటి వెంకట నారాయణ, కల్లేటి నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కాకర్ల ఖాశిం, చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆర్.పెద్ద వెంకటరెడ్డి, జి.శ్రీనివాసులు, కృష్ణయ్య, ఎస్.రామాంజనేయులు, కె.నాగేశ్వరరెడ్డి, సయ్యద్ కాశీంవలి, పిక్కిలి గురవయ్య, ఏరువ శివప్రసాద్, షేక్ రశీద్, పులిగుజ్జు ఆశీర్వాదం, సందిరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, వేల్పుల చిట్టిబాబు, కదం పవన్‌కుమార్, నర్రా వెంకట సుబ్బయ్యను నియమించారు.

కొమరోలు మండలం..

వైస్ ప్రెసిడెంట్లుగా కందుల చిన్న శింగర్‌రెడ్డి, మొలక రమణమ్మ, జనరల్ సెక్రటరీలుగా దాసరి లక్ష్మయ్య, బొమ్మని వెంకటేశ్వర్లు, లకుమారపు వెంకట రమణ, నుసుం శ్రీనివాసులు, సెక్రటరీలుగా షేక్ యాసీన్, షేక్ దివాన్ షా, బండారు విక్రమ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అట్లా పెద్దిరెడ్డి, వైజా భాస్కర్‌రెడ్డి, ఉలాపు రామచంద్రారావు, పోలు రమణారెడ్డి, దాసరి భాస్కరయ్య, అక్కలరెడ్డి వెంగళరెడ్డి, నల్లగొలుసుల బాలగురవయ్య, పోలేబోయిన చంద్రశేఖర్, ఉలాపు బ్రహ్మయ్య, శీలం వినోద్ కుమార్‌రెడ్డి, పగడాల చంద్రశేఖర్, దూదేకుల బాదరయ్య, మందా అబ్రహాం, బొమ్మని రమణను నియమించారు.

ఎంపీపీ మాతృమూర్తికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తల్లి వేగినాటి మంగమ్మ ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఖాజీపురంలో మంగమ్మ భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా వెంకట రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీలు వెంకట్రావ్, కడప వంశీధరరెడ్డి, రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీలు బీవీ రాజయ్య, చెన్నువిజయ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు ఆవుల శ్రీధర్‌రెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, ఏరువ రంగారెడ్డి, మాజీ ఎంపీపీలు రవికుమార్ యాదవ్, వెంకటరాజు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కామూరి రమణారెడ్డి, నెమిలిదిన్నె చెన్నారెడ్డి, వెన్నా భాస్కర్‌రెడ్డి, మల్లెల శేఖర్ రెడ్డి, బొల్లా బాలిరెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న కంభం సీఐ

మార్కాపురం టౌన్: ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని మార్కాపురం సీఐ సుబ్బారావు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం పీస్ కమిటీ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కంభం: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కంభం సీఐ కె. మల్లికార్జున సూచించారు. నాగులవరం రోడ్డులో ఈద్గా మైదానంలో ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం సీఐ పరిశీలించారు. రాత్రి సర్కిల్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఈద్గా వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

రాచర్ల: ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. ఎక్కడా ఎలాంటి గొడవలు, ఘర్షణలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముస్లిం మత పెద్దలను కోరారు.

కొమరోలు: ముస్లింలు శనివారం నిర్వహించుకునే బక్రీద్ పండుగను మండలంలో శాంతియుతంగా జరుపుకోవాలని కొమరోలు ఎస్సై నాగరాజు కోరారు. ముస్లింలు సోదరభావంతో పండుగ నిర్వహించుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతి, సహనం కలిగి పండుగ జరుపుకోవాలన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ఉత్తమ విద్యార్థులకు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పట్టణానికి చెందిన అన్నదమ్ములు స్వరూప్, అభిషేక్‌లు ప్రతిభకనబరచి ఉత్తమ విద్యార్థులుగా ఎంపికయ్యారు. చదరంగం, చిత్రలేఖనం, క్యారమ్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, యువప్రగతి సంస్థ అధ్యక్షుడు ఫరూక్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శర్వాణి

మార్కాపురం: పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని వంట నిర్వాహకులు అందించాలని ఎంఈఓ శర్వాణి సూచించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వంట నిర్వాహకులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పోషకాహారం ప్రాముఖ్యతను, పోషకాహార లోపాన్ని, ఆహార బలవర్ధకతను వివరించారు. ఆహారం వండేటప్పుడు నూనె, ఉప్పు, ఎంత మోతాదు వాడాలో వివరించారు. విద్యార్థులకు మంచినీరు, పరిసరాల పరిశుభ్రత వంటశాలల్లో పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు దివ్యశ్రీ, పి రంగారావు, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సగిలేరు సప్లయ్ చానల్ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్‌శాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సగిలేరు చానల్ కాలువను స్థానిక ఇరిగేషన్ డీఈ రామారావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నల్లబండ బజారు మీదుగా సత్యవేలు గ్రామానికి వెళ్లే సప్లై చానల్ కాలువలను పరిశీలించారు. సప్లై చానల్స్‌లో అక్కడక్కడా కొంత మేర కట్టలు తెగిపోయి ఉండటాన్ని గమనించారు. కాలువ పూర్తి స్థాయిలో చిల్లచెట్లు పెరిగి పూడిపోయిందని గ్రహించి కాలువ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. కాలువ అభివృద్ధి పనుల కోసం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నామన్నారు. సగిలేరు సప్‌లెచైనల్ కాలువ అభివృద్ధి చెందడం వల్ల రాచర్ల మండలంలోని 5 చెరువులకు పుష్కలంగా నీరు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ సుధాకర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బొర్రా శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మ తల్లి జాతర



అంకాలమ్మ తల్లి

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో శనివారం అంకాలమ్మ తల్లి జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 20 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న జాతర గత ఏడాది అనివార్య కారణాలతో నిలిచింది. దీంతో ఈ ఏడాది భారీ స్థాయిలో జాతర నిర్వహించేందుకు కొనకనమిట్లతోపాటు పంచాయతీ పరిధిలోని పుట్లూరివారిపల్లి, ఎర్రగడ్డ గ్రామాల ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సందర్భంగా శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభ, టీడీపీ తరపున ఒకటి, రెండు కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. జాతర సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆలయాన్ని అలంకరించి ప్రారంభ పూజలు నిర్వహించారు.

ప్రముఖులకు ఆహ్వానం



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

అంకాలమ్మ తల్లి జాతరలో పాల్గొనాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, కేపీ కొండారెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, జంకె వెంకటరెడ్డిని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి ఆహ్వానించారు. పార్టీ నేతలను కలిసిన వారిలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పి.కొండారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, మెట్టు అల్లూరురెడ్డి, కొనకనమిట్ల పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

భక్తులతో పులకించిన నాగంపల్లి



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

కొనకనమిట్ల:

- వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ
- భక్తుల జయజయధ్వానాల నడుమ పట్టాభిరామస్వామి కల్యాణం

మండలంలోని నాగంపల్లి గ్రామంలో మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న పట్టాభిరామచంద్రస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ఉత్సవ విగ్రహాల జీర్ణోద్ధరణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకొని వందలాదిగా వచ్చిన భక్తులతో నాగంపల్లి గ్రామం పులకించింది.

వేదపండితుడు శేఖరశర్మ పర్యవేక్షణలో తిరుపతి ఆగమ పండితులు శిష్యబృందం ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయ దాతలతోపాటు బంధుమిత్రులు తరలి రావటంతో పండగ వాతావరణం నెలకొంది. తొలుత కలశ ఉత్సవం భక్తుల కోలాహలం నడుమ నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే గురువారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది.



కలశ ఉత్సవం

పగలే వెన్నెల..!



గొట్లగట్టులో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో రాత్రి పూట కూడా వీధి లైట్లు వెలగక ప్రజలు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొట్లగట్టు, పేరారెడ్డిపల్లి, కాట్రగుంట, వెంగలపల్లి తదితర గ్రామాల్లో పగటిపూట వీధి లైట్లు వెలుగుతున్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు. నాయుడుపేటలో వీధి లైట్లు వెలగక చీకట్లో మగ్గుతున్నామని గ్రామస్తులు ఆరోపించారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కిట్స్ ఇంజినీరింగ్, జార్జి ఇంజినీరింగ్ కళాశాలల్లో డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. కిట్స్ కళాశాలలో 100 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 89 మంది, జార్జి కళాశాలలో 120 మందికిగాను 106 మంది హాజరయ్యారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన పరీక్షలను డీఎస్సీ యు.నాగరాజు పరిశీలించారు. అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లపై కళాశాలల ప్రిన్సిపాళ్లు వెన్నా కృష్ణారెడ్డి, రాజబాబు, పెద్దారవీడు ఎస్సై అనీల్‌కుమార్ పర్యవేక్షించారు.